క్లుప్తంగా

ఇసుక విక్రయ కేంద్రం ప్రారంభం



ఇసుక విక్రయ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ వెంటక శివయ్య

ఉంగుటూరు: చేబ్రోలు గ్రామ శివారుల్లో ఇసుక అమ్మకం కేంద్రాన్ని తహసీల్దార్ వెంకట శివయ్య మంగళవారం ప్రారంభించారు. ఇక్కడ 531 టన్నులు ఇసుక నిల్వ ఉందని, ఇందులో కొంత మట్టితో కలిసిపోయిన ఇసుక నిర్మాణాలకు అంతగా ఉపయోగపడదని చెప్పారు. అమ్మకపు పన్ను, సీనరేజీ, రవాణా చార్జి కలిసి ఇసుక టన్నుకు రూ.538ని వివరించారు.

అంజన్నకు ప్రత్యేక పూజలు



వీరభద్రపురంలో ఆకట్టుకున్న అలంకరణ

దెందులూరు: మండలంలోని గాలాయగూడెం, వీరభద్రపురం గ్రామాల్లో ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారం ఆయా ఆలయ అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు స్వామి వార్లకు వివిధ పుష్పాలతో విశేషాలంకరణలు చేశారు. వీరభద్రపురం ఆంజనేయ స్వామి ఆలయంలో అధిక సంఖ్యలోభక్తులు హాజరై పూజలు నిర్వహించారు.

పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలి



శ్రీరామవరం పాఠశాలలో పుస్తకాలు అందిస్తున్న నూజివీడు డీఎస్పీ గోలి లక్ష్మయ్య

దెందులూరు: ప్రాథమిక స్థాయి నుంచి పాఠ్యాంశాలతో పాటు విజ్ఞానం, సామాజిక పుస్తకాలను చదవడం అలవాటు చేసుకోవాలని నూజివీడు డీఎస్పీ గోలి లక్ష్మయ్య అన్నారు. మండలంలోని శ్రీరామవరం ప్రాథమిక పాఠశాలలో డీఎస్పీ సొంత ఖర్చుతో నోటు పుస్తకాలు, వివిధ రకాల సామాజిక అంశాల పుస్తకాలను అందజేశారు. పుస్తకపఠనం విధిగా అలవాటు చేసుకుంటేనే అభివృద్ధి సాధ్యమని విద్యార్థులకు సూచించారు.

ఘనంగా జల హారతి



చల్లచింతలపూడిలో పట్టిసీమ నీటికి హారతులిస్తున్న దృశ్యం

దెందులూరు: పట్టిసీమ నీటితో సిరులు సీమగా ఈ ప్రాంతమంతా మారాలని, పంటలన్ని బాగా పండాలని దెందులూరు మాజీ వైస్ ఎంపీపీ నాగనబోయిన సత్యనారాయణ అన్నారు. మండలంలోని చల్లచింతలపూడిలో మంగళవారం పట్టిసీమ నీటికి శివాలయం అర్చకులతో జలహారతి ఇప్పించారు. కార్యక్రమంలో మాజీడ సర్పంచ్ ముమ్మడి మోహనరావు, టీడీపీ నేత వేమన రాము పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు వేగవంతం



సోమవరప్పాడులో పారిశుధ్య పనులు చేస్తున్న కార్మికులు

దెందులూరు: గ్రామాల్లో పారిశుధ్య పనులు వేగవంతమయ్యాయని దెందులూరు ఎంపీడీఓ వి.శ్రీలత అన్నారు. మంగళవారం దెందులూరు, సోమవరప్పాడు ఇతర గ్రామాల్లో జరుగుతున్న పనులను ఈఓపీఆర్‌డీతో కలిసి పరిశీలించారు. రోడ్డుకిరువైపులా చెత్తను ఎత్తించడం, డ్రెయినేజీలు, వాటర్ ట్యాంకులు శుభ్రపరచడం, బ్లీచింగ్ చల్లిస్తున్నారు. అన్ని గ్రామాల్లో గ్రామ కార్యదర్శులు పూర్తిస్థాయిలో పనుల పర్యవేక్షణలో సంతృప్తికరంగా విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు.

విషజ్వరాలు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి

బుట్టాయగూడెం: గిరిజన ప్రాంతంలో విషజ్వరాలు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని సీపీఎం నాయకులు తెల్లం రామకృష్ణ కోరారు. బుట్టాయగూడెంలో సీపీఎం మండల కమిటీ సమావేశం మంగళవారం కోర్సా జలపాలు అధ్యక్షతన నిర్వహించారు. రామకృష్ణ మాట్లాడుతూ ప్రస్తుత వర్షాలకు గ్రామాల్లో జ్వరాలు విజృంభిస్తున్నాయన్నారు. వీటి నివారణకు చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. టైఫాయిడ్, మలేరియా పరీక్షలు చేసి గిరిజనులకు ఇబ్బంది కలుగకుండా చూడాలన్నారు.

అతిసారకు అప్రమత్తతే శ్రీరామరక్ష



గణపవరంలో డయేరియాపై అవగాహన ప్రదర్శన



నిడమర్రులో పారిశుధ్య పరిస్థితిని పరిశీలిస్తున్న జిల్లా అధికారులు

- నివారణకు ప్రజల్లో అవగాహన
- రెండు నెలలపాటు 'స్టాప్ డయేరియా'

గణపవరం: వాతావరణ మార్పులతో అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం పొంచి ఉంది. వర్షాలు జోరుగా కురుస్తుండడంతో పల్లెలు, పట్టణాలన్న తేడా లేకుండా పారిశుధ్య పరిస్థితులు క్షీణిస్తున్నాయి. మంచినీటి వనరులు కాలుష్యమవుతున్నాయి. మురుగు డ్రెయిన్లు పొంగి రోడ్లపై ప్రవహిస్తున్నాయి. అపారిశుధ్య పరిస్థితుల కారణంగా దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. ఈ పరిస్థితులు అతిసార వ్యాధి వ్యాప్తికి అనుకూలం కావడంతో ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. రెండు నెలలపాటు స్టాప్ డయేరియా కార్యాచరణ ప్రకటించింది.

ఆగస్టు వరకు అవగాహన కార్యక్రమాలు

ఆరోగ్యశాఖ గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టి, ప్రజలకు డయేరియా నివారణపై అవగాహన కల్పిస్తోంది. జూలై 1వ తేదీన ప్రారంభమైన డయేరియా నివారణ మాసోత్సవ కార్యక్రమం ఆగస్టు 30వ తేదీ వరకు కొనసాగనుంది. అతిసార వ్యాధిని నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతకంగా మారుతుంది. అపరిశుభ్రమైన, కలుషిత నీటిని తాగడం వల్లే డయేరియా వ్యాపిస్తుంది. ప్రస్తుతం రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో డయేరియా విజృంభిస్తున్న



కాశిపాడులో రక్షిత మంచినీటిని పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

నేపథ్యంలో ప్రజలకు డయేరియా వ్యాధి రావడానికి కారణాలు, రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యాధి సోకితే తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కలిగి ఉంటే మంచిదని వైద్యులు సూచిస్తున్నారు.

అతిసార లక్షణాలు

పలుచగా, నీళ్లమాదిరిగా ఎక్కువగా విరేచనాలు అవుతుంటే అది అతిసారగా గుర్తించాలి. వరుసగా విరేచనాలు అవుతుంటే నీరసం, వికారం, వాంతులతో శరీరంలో లవణాలు తగ్గిపోయి, కాళ్ల నొప్పులు తదితర లక్షణాలు కనిపిస్తాయి. వాంతులు, విరేచనాల ద్వారా అధిక మొత్తంలో నీరు బయటకుపోవడం వల్ల డీహైడ్రేషన్‌కు గురై ప్రాణాపాయం సైతం సంభవించే అవకాశం ఉంటుంది.



వాకపల్లిలో వీధుల్లో బ్లీచింగ్ చల్లుతున్న పంచాయతీ సిబ్బంది

అతిసారకు కారణం

కలుషితమైన నీరు తాగినా, ఈగలు, వాలిన ఆహార పదార్థాలు తినడం వల్ల వివిధ రకాల వైరస్‌లు, బ్యాక్టీరియా శరీరంలోకి ప్రవేశించి అతిసార వ్యాధికి గురవుతాం. చల్లబడ్డ ఆహారం తీసుకోవడం, మాంసాహారం ఫ్రిజ్జుల్లో నిల్వచేసుకుని తినడం వల్ల అతిసార సోకుతుంది. చిన్నారులు, వృద్ధుల విషయంలో మరింత జాగ్రత్త తీసుకోవాలి.

ప్రత్యేక కార్యాచరణ

స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా వైద్య సిబ్బంది ప్రతిరోజూ గ్రామ సచివాలయాల పరిధిలో ప్రజలకు అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహిస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి పారిశుధ్యంపై అవగాహన కల్పిస్తున్నారు. మురుగు డ్రెయిన్ల ప్రక్షాళన, రోడ్ల పక్కన చెత్తాచెదారం తొలగింపు, రోడ్ల పక్కన బ్లీచింగ్ చల్లడం, మంచినీటి పరీక్షలు, ఇళ్లు, పరిసర ప్రాంతాల్లో పాతటైర్లు, కొబ్బరి డొక్కులు, పాతసామాన్లు వంటివి లేకుండా చర్యలు తీసుకోవాలని అవగాహన కల్పిస్తున్నారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. పంచాయతీ రక్షిత మంచినీటి పథకాలను తనిఖీ చేస్తూ.. క్లోరినేషన్ చేసిన నీటినే ప్రజలకు అందించేలా చర్యలు తీసుకుంటున్నారు. అవసరం మేరకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్నారు.

కలుషిత నీటితోనే ప్రమాదం



కలుషిత నీటితోనే అతిసార వ్యాధి సోకుతుంది. ప్రజలు సురక్షితమైన నీటిని, కాచి చల్లార్చిన నీటినే తాగాలి. వేడివేడి ఆహార పదార్థాలను మాత్రమే తినాలు, ఎవరికైనా అతిసార సోకినట్టు అనుమానం వస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పీహెచ్‌సీకి వచ్చి వైద్యులను సంప్రదించాలి.

– పులపర్తి సంతోష్, వైద్యాధికారి

మాతాశిశు మరణాలను అరికట్టాలి



మాతాశిశు మరణాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

దెందులూరు: మాతాశిశు మరణాలు నివారించడం ప్రధానమంత్రి సంరక్షణ యోజన పథకం లక్ష్యమని దెందులూరు సీహెచ్‌సీ గైనకాలజిస్ట్ డాక్టర్ షాలిని అన్నారు. ప్రతి నెలా 9న ప్రధానమంత్రి సంరక్షణ యోజనా పథకంలో భాగంగా గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వ వైద్యశాలల్లో పరీక్షలు చేస్తున్నామని తెలిపారు. మంగళవారం దెందులూరు ఆస్పత్రిలో గర్భిణులు, బాలింతలకు సేవలను అందించారు. ఈ సందర్భంగా షాలినీ మాట్లాడుతూ పరీక్షలు, వైద్య సేవలు పొందే విషయంలో నిర్లక్ష్యం వహిస్తే భారీ మూల్యం చెల్లించుకోకతప్పదన్నారు. ప్రభుత్వం మాతా శిశు సంరక్షణ పథకం అమలుకు చేస్తున్న కృషికి వైద్య సిబ్బంది చేస్తున్న సేవలకు గర్భిణులు, బాలింతలు పూర్తి సహాయ సహకారాలు అందిస్తేనే సత్ఫలితాలు లభిస్తాయన్నారు.

18 నుంచి కుష్టు వ్యాధి నిర్మూలన సర్వే

దెందులూరు: జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఈ నెల 18 నుంచి ఆగస్టు 2 వరకు ప్రతి గ్రామ శివారు ప్రాంతంలో ఇంటింటి సర్వే చేస్తామని దెందులూరు సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ సుధాకర్ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడం ద్వారా కుష్టు వ్యాధిని చాలా వరకు అరికట్టవచ్చన్నారు. వ్యాధిగ్రస్తులను ముందుగానే గుర్తించవచ్చని వివరించారు. ఈ వ్యాధి కారణాలు, లక్షణాలు, చికిత్స నివారణ చర్యలను అన్ని పాఠశాలలు, కళాశాలల్లో వైద్య సిబ్బంది తనిఖీ చేసి గుర్తించాలన్నారు. కుష్టు వ్యాధిని ముందుగానే గుర్తించడం ద్వారా అంగవైకల్యాన్ని నివారించవచ్చని పేర్కొన్నారు.

పోలసానిపల్లిలో మలేరియా వ్యతిరేక మాసోత్సవం



పోలసానిపల్లి రహదారిపై మానవహారం



పోలసానిపల్లి రహదారి డ్రెయిన్లో పూడిక తీస్తున్న దృశ్యం

భీమడోలు: సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పోలసానిపల్లి సర్పంచ్ షేక్ రహీమాబేగం, ఈవోఆర్‌డీ ఎ.సుందరిలు అన్నారు. డెంగీ, డయేరియా, మలేరియా వ్యతిరేక మాసోత్సవంలో భాగంగా మంగళవారం పోలసానిపల్లి గ్రామంలోని నెం.1 పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు, సచివాలయ ఉద్యోగులు, ఆశావర్కర్లతో పురవీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. డెంగీ నివారణే.. ఉత్తమ రక్షణ.. సమాజ భాగస్వామ్యంతో డెంగీని నివారిద్దాం అంటూ నినదించారు. పోలసానిపల్లి ప్రధాన రహదారిపై మానవహారంగా ఏర్పడ్డారు. అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి వారికి తగు సూచనలను అందించారు. చిన్నారులు భోజనానికి ముందు, తర్వాత చేతులు శుభ్రం చేసుకునేలా కార్యకర్తలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అనంతరం భీమడోలు జంక్షన్ నుంచి పోలసానిపల్లి వెళ్లే రహదారి పక్కనే ఉన్న ప్రధాన డ్రెయిన్‌లో జేసీబీ సాయంతో పూడిక తీయించారు. వ్యర్థాలను డ్రెయిన్‌లో వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వ్యాపారులను హెచ్చరించారు. ప్లాస్టిక్ వినియోగంపై నిషేధమని దుకాణాల వద్ద అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రహీమాబేగం, సుందరిలు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని అన్నారు. గ్రామ కార్యదర్శి జయరామకృష్ణ, హెచ్‌ఎం కె.తులసి, ఉపాధ్యాయులు కాటాక్షి, ఏఎన్‌ఎం, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశావర్కర్లు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పెరుగ్గూడెంలో మంత్రి నాదెండ్ల పర్యటన

దెందులూరు: రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ బుధవారం పెరుగ్గూడెం గ్రామానికి విచ్చేస్తారని మంత్రి బంధువు, పెరుగ్గూడెం మాజీ సర్పంచ్ యలమర్తి హేమలతా శ్రీనివాస్ మంగళవారం విలేకరులకు తెలిపారు. మంత్రి బంధువుల ఇంటికి వస్తున్నారని బుధ, గురువారాల్లో పెరుగ్గూడెంలో ఉంటారని వివరించారు.

వాణిజ్య పంటల సాగుతో రైతులకు ఆర్థిక లాభం

బుట్టాయగూడెం: వాణిజ్య పంటల సాగుతో రైతులు ఆర్థిక లాభం పొందవచ్చని సీటీఆర్ఐ ఆర్ఎస్ జీలుగుమిల్లి హెడ్ డాక్టర్ వైవీ సుబ్బయ్య అన్నారు. జీలుగుమిల్లిలో గిరిజన, దళిత ఉపప్రణాళికలో భాగంగా వాణిజ్య పంటలపై రైతులకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీటీఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ మాగంటి శేషుమాధవ్ ఆదేశాల మేరకు రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉత్తర ప్రాంత తేలిక నేలలకు అనువైన వాణిజ్య పంటలు, వాటి సాగు విధానాలు, వివిధ రకాల వాణిజ్య పంటల ద్వారా లభించే ఆర్థిక లాభాలు, పంట మార్పిడి విధానంపై రైతులకు అవగాహన కలిగించారు. వాణిజ్య పంట మార్పిడి విధానం, పశుసాగులో వివిధ దశలను వివరించారు. అనంతరం 160 మంది ఎస్సీ, ఎస్టీ రైతులకు పసుపు విత్తనాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీటీఆర్ఐ శాస్త్రవేత్త ఎస్.వెంకటేషన్, ఫార్మ్ మేనేజర్ టి.వెంకటేష్, టి.రమేష్, సీహెచ్ సుధాకర్‌బాబు, వై వెంకటేశ్వరరావు, బి.దుర్గారావు, జీఎమ్ఎస్ అన్నపూర్ణ, డి.దేనానంద్, తదితరులు పాల్గొన్నారు.

విజిలెన్స్ అధికారుల తనిఖీలు



ఎస్ఎస్‌డీ బయో సైన్సెస్‌లో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు



విజయరాయిలో నూజివీడు సీడ్స్ కంపెనీలో తనిఖీలు చేస్తున్న అధికారులు

దెందులూరు: మండలంలోని గోపన్నపాలెం పంచాయతీ శివారు ప్రాంతంలోని ఎస్ఎస్‌డీ బయోసైన్సెస్ (లిక్విడ్ బయో ఫెర్టిలైజర్స్ తయారీ యూనిట్)ను మంగళవారం విజిలెన్స్ స్పెషల్ స్క్వాడ్ అధికారులు తనిఖీ చేశారు. లిక్విడ్ బయో ఫెర్టిలైజర్స్ తయారీ యూనిట్‌కు సంబంధించి తనిఖీ అంశాలు అడిగి తెలుసుకున్నారు. యూనిట్ లోపలి తయారీ భాగాలను పరిశీలించారు.

విజయరాయిలో..

పెదవేగి మండలం విజయరాయి గ్రామంలో నూజివీడు సీడ్స్ కంపెనీలో మంగళవారం అమరావతి నుంచి వచ్చిన స్పెషల్ స్క్వాడ్ అధికారులు వి.అజయ్‌ప్రసాద్, విజిలెన్స్ ఏఈ విల్సన్, ఏడీఏ వై.సుబ్బారావు, పెదవేగి ఏఓ ప్రియాంక, టెక్నికల్ ఏఓ వెంకటేశ్వర్లు తనిఖీలు నిర్వహించారు. స్టాక్ రిజిస్టర్‌ను, లైసెన్స్ గ్రౌండ్ బ్యాలెన్స్, విత్తనాల ప్రాసెసింగ్ యూనిట్లు, స్టాక్, గ్లోయర్స్ లిస్టు, ఇన్‌వాస్ పుస్తకం తనిఖీ చేశారు. డోర్ నెంబర్స్‌కు సంబంధించి కంపెనీకి పలు సూచనలు చేశారు.

సీసీఆర్‌సీ కార్డులు పొందాలి



సీసీఆర్‌సీ కార్డులపై సమావేశం నిర్వహిస్తున్న ఆర్డీఓ అద్దయ్య

పోలవరం రూరల్: సాగు రైతులు వారి వివరాలను వీఆర్వో, ఆర్‌ఎస్‌కే సహాయకులకు తెలియజేసి సీసీఆర్‌సీ (పంట సాగుదారుల హక్కు పత్రం) పొందాలని ఆర్డీఓ కె.అద్దయ్య తెలిపారు. పోలవరం రెవెన్యూ కార్యాలయంలో మండలంలోని వీఆర్ఓ, వ్యవసాయ శాఖ సిబ్బందితో మంగళవారం సమావేశం నిర్వహించారు. సాగుదారులంతా తమ వివరాలను తెలియజేసి సీసీఆర్‌సీ కార్డులు పొందాలన్నారు. కార్డు కాలపరిమితి 11 నెలలు ఉంటుందని, మద్దతు ధర, పంట రుణం, పెట్టుబడి రాయితీ, ఇన్సూరెన్స్ పథకాలు అందుతాయని తెలిపారు. భూ యజమానికి ఎటువంటి ఇబ్బందులు ఉండవని, సాగుదారుడికి పంటకు మాత్రమే అర్హత కల్పిస్తుందన్నారు. గతంలో సీసీఆర్‌సీ కార్డు ఉన్న వారు దరఖాస్తుతో పాటు సీసీఆర్‌సీ కార్డు జిరాక్స్ జతచేస్తే రెన్యువల్ చేస్తామని, నూతన సాగుదారులకు కార్డులను అందిస్తామని తెలిపారు. ఈ నెల 11, 12వ తేదీల్లో సమీప రైతు సేవా కేంద్రంలో గ్రామసభలు నిర్వహించి, సాగుదారులను గుర్తించి, సీసీఆర్‌సీ కార్డులు జారీ చేయడం జరుగుతుందన్నారు. మండలంలోని రైతులందరూ సమీప రైతు సేవా కేంద్రాలకు వెళ్లి సీసీఆర్‌సీ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జీవీఎస్ ప్రసాద్, వ్యవసాయాధికారి కె.రాంబాబు, రైతులు, వ్యవసాయ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టర్‌కు పాస్టర్స్ ఫెడరేషన్ అభినందన

ఏలూరు (టూటౌన్): ఇటీవల ఏలూరు జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన వెట్రిసెల్విని మంగళవారం ఏపీ పాస్టర్స్ ఫెడరేషన్ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆమెకు పుష్పగుచ్ఛం అందజేశారు. ఫెడరేషన్ జనరల్ సెక్రెటరీ పి.జీవన్‌కుమార్ ఆధ్వర్యంలో పలువు రు సంఘ నాయకలు కలెక్టర్‌ను కలిశారు. క్రైస్తవుల సంక్షేమానికి కృషి చేయాలని, క్రైస్తవుల సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఏపీపీఎఫ్ ఏలూరు జిల్లా అధ్యక్షుడు జాన్ పీటర్, డాక్టర్ పీపీఎస్ కిరణ్, చిక్కాల జోసఫ్, ఎస్ఎల్ పాల్, రాష్ట్ర, జిల్లా నాయకులు ఉన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉందాం



డ్రగ్ ఫ్రీ జిల్లా ఏర్పాటుకు సహకరించాలని ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): మాదక ద్రవ్యాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని, ప్రతి ఒక్కరూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, డ్రగ్స్ వినియోగం ప్రాణాంతకమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిటీ మెంబర్ జె.రాజేంద్ర ప్రసాద్ సూచించారు. నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో స్థానిక సీఆర్ రెడ్డి ఫార్మసీ కళాశాల, ఆదిత్య డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో మంగళవారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వినియోగంపై వ్యతిరేక ప్రచార వారోత్సవాల్లో భాగంగా డ్రగ్ ఫ్రీ సూపర్ హీరో సెల్ఫీ కాంటెస్ట్ నిర్వహించారు. విద్యార్థులు అందరు నేను డ్రగ్ ఫ్రీ సూపర్ హీరో అని ఉత్సాహంతో పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటు పడి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నార్కోటిక్ డ్రగ్స్, ఎన్‌డీపీఎస్ చట్టం మాదకద్రవ్యాల నేరాలను చాలా తీవ్రంగా చూస్తుందని, మాదకద్రవ్యాల నేరాల్లో శిక్ష, జరిమానా రెండు కూడా కఠినంగా ఉంటాయని వివరించారు. సీఆర్ రెడ్డి ఫార్మసీ కళాశాల కరెస్పాండెంట్ రాజా రామ్మోహనరావు మాట్లాడుతూ విద్యార్థి స్థాయి నుంచే మాదకద్రవ్యాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మాదకద్రవ్యాలు జీవితాన్ని ఎటువంటి పతనావస్థకి చేరుస్తాయో ముందుగానే తెలుసుకొని సక్రమమైన మార్గంలో జీవించాలని సూచించారు. నవజీవన్ బాల భవన్ జోనల్ కోఆర్డినేటర్ కె.ప్రియాంక మాట్లాడుతూ జూన్ 24 నుంచి జూలై 10వ తేదీ వరకు ఏలూరు పరిసర ప్రాంతాల్లో డ్రగ్ ఫ్రీ సూపర్ హీరో సెల్ఫీ కాంటెస్ట్ విద్యార్థులతో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ పోటీలో గెలుపొందిన విజేతకు రూ.5 వేలు నగదు బహుమతి అందజేస్తామన్నారు. అనంతరం ఏలూరు జిల్లాను డ్రగ్ ఫ్రీ జిల్లాగా ఉంచడానికి అందరూ సహకరించాలని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సీఆర్ రెడ్డి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.నరేంద్ర బాబు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ కె.శైలజ, ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వి.వెంకటేశ్వరావు, అధ్యాపకులు, నవజీవన్ బాలభవన్ జోనల్ కోఆర్డినేటర్లు ఎస్ జాకబ్ రాజు, ఒ.నజ్మా, డి.విజయరాణి, ఇ.వెంకటేశ్వరావు, వి.జయపాల్, జె.జ్యోతి చంద్రిక, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు విద్యార్థులు పాల్గొన్నారు.

ఆషాఢం.. అన్నింటా ప్రత్యేకం



గిరిజన ప్రాంతంలో బోనాల జాతర నిర్వహిస్తున్న దృశ్యం



వర్షాకాలం ప్రారంభం కావడంతో వ్యవసాయ పనుల్లో ఓ రైతు

బుట్టాయగూడెం: ఆచార వ్యవహారాలకు పెద్దపీట వేసే సనాతన హైందవ సంప్రదాయంలో ప్రతినెలా ప్రత్యేకత సంతరించుకున్నదే. తొలకరి జల్లులతో ప్రకృతి పచ్చని శోభను సంతరించుకునే వేళ వచ్చే ఆషాఢ మాసం కూడా అనేక విశేషాలు ఉన్నదే. చంద్ర గమనంలో పూర్వాషాఢ నక్షత్ర సమీపంలో సంచరించే సమయం కాబట్టి ఆషాఢ మాసంగా పిలుచుకుంటారు. శుభకార్యాలకు అవకాశం లేకున్నా ఆధ్యాత్మికంగా ఎన్నో ప్రత్యేకతలు కలిగి ఉన్న ఆషాఢ మాసం ఈ నెల 6వ తేదీన ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఏ శుభకార్యాలూ చేసేందుకు వీలులేదని భావించే ఈ మాసం నిజానికి ఎంతో ప్రాముఖ్యత కలిగి ఉంది. తొలి ఏకాదశి, గురుపౌర్ణమి, చాతుర్మాస వ్రతాలు, ప్రసిద్ధ జగన్నాథ రథయాత్రలు ఈ మాసంలోనే జరుగుతాయి. అలాగే ఈ ఆషాఢ మాసంలోనే గిరిజన ప్రాంతంలో అనేక చోట్ల బోనాల జాతరను కూడా జరుపుకుంటారు. అలాగే గుబ్బల మంగమ్మ గుడి వద్ద కూడా అనేక మంది బోనాలు ఎత్తుకుని గుబ్బల మంగమ్మ తల్లికి సమర్పిస్తారు.

వ్యవసాయ పనుల్లో నిమగ్నం

ఆషాఢమాసాన్ని పూర్వీకులు శూన్యమాసంగా భావిస్తారు. ఈ శూన్య మాసంలో సాధారణంగా శుభకార్యాలు నిర్వహించరు. ఆషాఢంలో గృహప్రవేశం, నిశ్చితార్థం, వివాహం, ఉపనయనం, తదితర శుభకార్యాల నిర్వహణ అనువుగా ఉండదని భావిస్తారు. ఈ మాస ప్రారంభ సమయానికి వర్షాలు విరివిగా కురుస్తుంటాయి. దీంతో వ్యవసాయ సాగు పనులు కూడా జోరుగా జరుగుతుంటాయి. ప్రతి ఒక్కరూ వ్యవసాయ పనిలోనే నిమగ్నమవుతున్నందున శుభకార్యాలకు తావు ఉండదు.

కొత్త దంపతులకు ఎడబాటు

కొత్తగా వివాహం చేసుకున్న దంపతులను ఆషాఢ మాసంలో దూరంగా ఉంచే సంప్రదాయం అనాదిగా వస్తుంది. ఇంటిల్లపాది పంటల సాగు పనిలో తీరికలేకుండా ఉంటారు. కాబట్టి కొత్త అల్లుడికి మర్యాదలు చేసే వీలు ఉండకపోవడం ఒక కారణంగా చెప్పవచ్చు. కాగా నవ దంపతులు సంసారిక జీవనం ఫలితంగా గర్భాధారణ జరిగితే ప్రసవ సమయం వచ్చే ఏడాది ఏప్రిల్, మే నెలలో ఉంటుంది. తీవ్రమైన ఎండాకాలం కాబట్టి తల్లీ బిడ్డల ఆరోగ్యానికి మంచిది కాదని ఆషాఢ మాసంలో నవ దంపతులను ఈ నెల రోజులపాటు ఎడంగా ఉంచుతారు.